మేడారం ట్రస్టుబోర్డు కమిటీ ఏర్పాటు.. ఉత్తర్వులు జారీ

మన తెలంగాణ/ హైదరాబాద్ : వచ్చే ఏడాది జరగనున్న సమ్మక్క–సారలమ్మ జాతన మేడారం ట్రస్టుబోర్డు కమిటీని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి ఎన్. శివశంకర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. 14 మందితో కూడిన కమిటీని వేశారు. సీనియర్ అర్చకులు సిద్దబోయిన జగ్గారావు ఎక్స్‌అఫిషియో మెంబర్‌గా వ్యవహరించనున్నారు. ట్రస్టీలు పదవీకాలం ఏడాది పాటు ఉండనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే కామన్ గుడ్ ఫండ్ రూల్స్ 2005 చట్ట సవరణకు సంబంధించి ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేస్తూ ప్రభుత్వ కార్యదర్శి ఎన్. శివశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు. నోటిఫికేషన్ ప్రకారం ప్రభుత్వ గ్రాంటులను ఆలయ కమిటీలు సాంక్షన్ తేదీ నుంచి 5 ఏళ్లలోపు వినియోగించుకోవాలి. ఏదైనా సమస్యతో వినియోగం కాకపోతే ఒక సంవత్సరం పొడిగిస్తారు. సవరించిన చట్టం ప్రకారం ఒక్క ఆలయానికి కామన్ గుడ్ ఫండ్ రూ. 50 లక్షలు మించకూడదు.

ఆదాయం పెరిగిదంటూనే.. జిఎస్‌టి విధించారు

- **పోచారం శ్రీనివాస్ రెడ్డి**

మన తెలంగాణ/ హైదరాబాద్ : ఐదేళ్లలో అన్నదాత ఆదాయం రెట్టింపు చేస్తామంటూనే వారిపై కేంద్రం జిఎస్‌టి భారం మోపిందని వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఎటువంటి ప్రణాళికలు, విధానాలు లేకుండా రైతుల ఆదాయం ఎలా రెట్టింపు అవుతుందని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర విత్తన ధ్రువీకరణ అథారిటీ ఆధ్వర్యంలో చేపట్టిన అంతర్జాతీయ విత్తన ధ్రువీకరణ వర్క్‌షాప్ నాలుగో రోజు మంత్రి పోచారం పాల్గొని మాట్లాడారు. రైతుల ఆదాయం మెరుగు కావాలంటే విత్తనమే ముఖ్యమని, నాణ్యమైన విత్తనాలను సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. దిగుబడి పెరగడంతో పాటు, మద్ధతు ధర లభించినపుడే రైతుల ఆత్మహత్యలు ఆగుతాయన్నారు. ప్రపంచ దేశాలకు మన దేశం నుంచే విత్తనాలు ఎగుమతి అయ్యేలా శాస్త్రవేత్తలు, అధికారులు కృషి చేయాలన్నారు. ఈ ఏడాది కేంద్ర బడ్జెట్ ప్రసంగంలో రైతులకు పంట రుణాలు పెంచామని చెప్పారని, రుణాలు తీసుకోవడంతోనే అన్నదాతలు అప్పుల గోతిలో పడుతున్నారన్నారు. రైతులే బ్యాంకుల్లో తమ డబ్బును దాచుకునే రోజులు రావాలన్నారు. రాష్ట్రం ఏర్పడి అధికారంలోకి వచ్చిన మూడేళ్లలోనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు 98 శాతం అమలు చేసి చూపారన్నారు. సాగు నీటి ప్రాజెక్టులు, వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని చెప్పారు. 1.50 లక్షల కోట్లతో ప్రాజెక్టులు నిర్మిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి సి. పార్థసారధి మాట్లాడుతూ విత్తన వాటాను పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. ఇష్టా తరహా ల్యాబ్‌లు మరిన్ని నెలకొల్పనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విత్తన ధ్రువీకరణ అథారిటీ సంచాలకులు డాక్టర్ కె. కేశవులు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన అధికారులు పాల్గొన్నారు.

మిషన్ కాకతీయ నాలుగో దశ ప్రక్రియ షురూ

మన తెలంగాణ/ హైదరాబాద్: మిషన్ కాకతీయ నాలుగో దశ అనుమతుల ప్రక్రియ ప్రారంభమైంది. నాలుగో దశలో ఖమ్మం జిల్లాలో 28 చెరువుల పునరుద్ధరణకు రూ.4.97 కోట్ల అంచనాతో మైనర్ ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించగా, ఇరిగేషన్ శాఖ పరిపాలనా అనుమతులు ఇచ్చింది. మిషన్ కాకతీయ నాలుగో దశలో ఇవే తొలి అనుమతులు. ఈ చెరువులు పునరుద్ధరిస్తే 1450 ఎకరాల ఆయకట్టుకు ఆసరా లభిస్తుంది. ఇదిలా ఉండగా 28 చెరువులకు వెంటనే టెండర్లు పిలిచి, పనులు ప్రారంభించాలని మంత్రి సంబంధిత ఇంజనీర్లను ఆదేశించారు. మిషన్ కాకతీయ నాలుగో దశ చెరువుల ఎస్టిమేట్లు నవంబరు 30 కల్లా సంబంధిత చీఫ్ ఇంజనీర్లకు పంపాలని ఎస్‌ఇలను ఆదేశించారు. డిసెంబరు 15 నాటికి సిఇల నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపితే 31 నాటికి పరిపాలనా అనుమతుల ప్రక్రియ పూర్తిచేయాలని ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్‌కు మంత్రి హరీశ్‌రావు సూచించారు. జనవరి మొదటివారంలో చెరువుల పునరుద్ధరణ పనులు ప్రారంభించాలని మంత్రి ఆదేశించారు. కాకతీయ రెండు, మూడో దశలో ప్రారంభించి పూర్తికాకుండా మిగిలిన చెరువుల పనులు పూర్తిచేసి, బిల్లులు చెల్లించాలని మంత్రి ఇంజనీర్లకు సూచించారు. నాణ్యతపై రాజీపడవద్దని, పనుల ప్రారంభానికి ముందే వ్యవసాయ శాఖ వారిచే చెరువు పూడిక మట్టి పరీక్షలు జరిపించాలని ఆదేశించారు. స్థానిక ప్రజాప్రతినిధులతో పనులు ప్రారంభించాలని, ఇందుకు గాను ముందుగానే వారి సమయం తీసుకోవాలని అధికారులకు మంత్రి హరీశ్‌రావు సూచించారు.

ఆన్‌లైన్ ఇ-వేలము ద్వారా ఆస్తి అమ్మకము

ఫోనెక్స్ ఎఆర్‌సి ప్రైవేట్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్: ధని కార్పొరేట్ పార్క్, 5వ అంతస్తు, 158, C.S.T. రోడ్, కలినా, శాంతాక్రజ్ (తూ) ముంబై-400098.
టెలిఫోన్: 022-67412314, ఫ్యాక్స్: 022-67412313
CIN: U67190MH2007PTC168303, Email:info@phoenixarc.co.in, Website: www.phoenixarc.co.in

ఆన్‌లైన్ ఇ-వేలము కొరకు బహిరంగ ప్రకటన

(సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002, (SARFAESI చట్టము) రూల్స్ 6, 7, 8 & 9తో చదువబడు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 క్రింద

ఇందుమూలంగా ప్రత్యేకించి రుణగ్రహీత, హామీదారులు మరియు సాధారణ ప్రజానీకానికి తెలియజేయడమేమనగా ఈ క్రింద తెలిపిన ఆస్తిని ఫోనెక్స్ ఎఆర్‌సి ప్రైవేట్ లిమిటెడ్ వారికి తనఖా పెట్టగా ఫోనెక్స్ ట్రస్ట్ ఎఫ్‌వై 17-08 (ఫోనెక్స్)గా వ్యవహరిస్తున్న (సౌత్ ఇండియన్ బ్యాంక్ లిమిటెడ్ వారి రుణమునకు సంబంధించి అసైన్‌మెంట్‌ను పరిశీలిస్తూ ఫోనెక్స్ అసైన్‌మెంట్ అగ్రిమెంట్ తేదీ: 17.03.2017 వారి పేరున) ఆస్తిని ఏది ఎక్కడ ఎలా ఉన్నదో అది అక్కడ అలానే ఆధారముగా బకాయిలు మరియు భవిష్యవడ్డీ, ఛార్జీలు మొంగు వాటితో వసూలు చేసుకొనుటకు (SARFAESI చట్టము)లోని సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 మరియు రూల్స్ 6, 7, 8 & 9లోని నదుపాయముల క్రింద నిబంధనలు వర్తిస్తూ మా వెబ్‌సైట్ https://www.bankeauctions.com ద్వారా ఆన్‌లైన్ ఇ-వేలము నిర్వహించబడును.

రుణగ్రహీత పేరు	మెస్సర్స్ జివిఆర్ ఎంటర్‌ప్రైజెస్ ప్రతినిధిగా ప్రొ. శ్రీ జి. వెంకటేశ్వరరావ్, ప్లాట్ నం.106, విజ్ఞానపురి కాలనీ, కూకట్‌పల్లి, హైదరాబాద్, తెలంగాణ-500072 మరియు పి నం. 31/బి, ఎఫ్ నం.301, భరణి అపార్ట్‌మెంట్స్ భాగ్యనగర్ కాలనీ, కూకట్‌పల్లి, హైదరాబాద్, తెలంగాణ-500072 మరియు ఫ్లాట్ నం.601, ఉషోదయ రెసిడెన్సీ, ఇ. నం.2-22-1/19, ప్లాట్ నం. 23 & 24, ఈనాడు కాలనీ, వివేకానంద నగర్, కూకట్‌పల్లి, హైదరాబాద్, తెలంగాణ-500072.
హామీదారుల పేరు	శ్రీమతి విజయలక్ష్మి గాది
SARFAESI యాక్ట్ 2002 లోని సెక్షన్ 13(2) క్రింద నోటీసు ప్రకారము సెక్యూర్డ్ రుణబకాయి	తేది: 16.11.2015 నాటికి రూ. 3,93,61,516.94 (రూపాయలు మూడు కోట్ల తొంభై మూడు లక్షల అరవై ఒక్క వేల ఐదు వందల పదహారు మరియు పైసలు తొంభైనాలుగు మాత్రమే) మరియు నెలసరి పద్ధతిపై 12.90%తో భవిష్య వడ్డీ మరియు 01.11.2015 నుండి 2% అపరాధ వడ్డీ.
SARFAESI యాక్ట్, 2002 క్రింద స్వాధీనత	భౌతికము
తనిఖీ తేది	18.12.2017 (పద్దెనిమిది డిసెంబర్ రెండు వేల పదిహేడు) (సోమవారము)న సా॥ 4 గం॥ల నుండి 5.30 గం॥ల మధ్య
ధరావత్తు	ఐటం-1: ధరావత్తు: రూ. 2,04,000/- (రూపాయలు రెండు లక్షల నాలుగు వేలు మాత్రమే) ఐటం-2: ధరావత్తు: రూ. 1,80,000/- (రూపాయలు ఒక లక్ష ఎనభై వేలు మాత్రమే) ఐటం-3: ధరావత్తు: రూ. 2,34,000/- (రూపాయలు రెండు లక్షల ముప్పై నాలుగు వేలు మాత్రమే) ధరావత్తు సొమ్మును ఫోనెక్స్ ట్రస్ట్ ఎఫ్‌వై 17-8, కరెంట్ ఖాతా 0812529164కు కోటక్ మహీంద్రాబ్యాంక్ లి., బ్రాంచ్ : బాంద్రా ఈస్ట్ IFSC Code: KKBK0001368కు RTGS ద్వారా పంపవలెను.
బిడ్ దాఖలు తేదీ (ఇ-వేలము)	08.01.2018 (ఎనిమిది జనవరి రెండు వేల పద్దెనిమిది) (సోమవారము) బ్యాంకు ముగియు సమయమునకు ముందుగా
రిజర్వు ధర	ఐటం-1: రూ. 20,40,000/- (రూపాయలు ఇరవై లక్షల నలభై వేలు మాత్రమే) ఐటం-2:రూ. 18,00,000/- (రూపాయలు పద్దెనిమిది లక్షలు మాత్రమే) ఐటం-3: రూ. 23,40,000/- (రూపాయలు ఇరవై మూడు లక్షల నలభై వేలు మాత్రమే)
బిడ్డు పెంపుదల	రూ. 50,000/- & గుణింపులలో
ఇ-వేలము తేది	09.01.2018 (తొమ్మిది జనవరి రెండు వేల పద్దెనిమిది) (మంగళవారము)న ఉ॥ 11 గం॥ల నుండి మ॥ 12 గం॥ల మధ్య
ఇ-వేలము విధానము	ఆన్‌లైన్ ఇ-వేలము
వేలమునకు సిద్ధముగా ఉన్న సెక్యూర్డ్ ఆస్తుల వివరణ	**ఆస్తి నం.1:** తెలంగాణ రాష్ట్రం, ఖమ్మం జిల్లా, సత్తుపల్లి మం॥, కిష్టారం గ్రా॥లోని సర్వే నం.162/ఏలో కిష్టారం గ్రా॥ పంచాయితీ క్రింద ఇ.నం.1-22లో 68 సెంట్ల అవిభాజ్య భూమితో 5059 చ॥అ॥ల విస్తీర్ణములో వాణిజ్య భవనము యావదాస్తి అన్ని అభివృద్ధులతో మరియు హక్కులతో శ్రీ జి. వెంకటేశ్వర్‌రావ్‌కు చెందియున్నది. **సరిహద్దులు:** ఉత్తరం: గాది విజయలక్ష్మి యొక్క ఆస్తి, దక్షిణం: చల్లగుళ్ల వెంకట ధర్మరావ్‌కు చెందిన ఆస్తి మరియు సింగరేణి సరిహద్దు, తూర్పు: కొడిమల అప్పారావ్‌కు చెందిన ఆస్తి, పడమర: ఖమ్మం – సత్తుపల్లి ఆర్ & బి రోడ్డు. **ఆస్తి నం.2:** తెలంగాణ రాష్ట్రం, ఖమ్మం జిల్లా, సత్తుపల్లి మం॥, కిష్టారం గ్రా॥ & గ్రా॥ పంచాయితీలోని సర్వే నం.162/ఏలో 60 సెంట్ల భూమి యావదాస్తి, అన్ని అభివృద్ధులతో మరియు హక్కులతో శ్రీమతి విజయలక్ష్మి గాదెకు చెందియున్నది. **సరిహద్దులు:** ఉత్తరం: అలుగు కాలువ, దక్షిణం: చల్లగుళ్ల వెంకట ధర్మరావ్‌కు చెందిన ఆస్తి, తూర్పు: కొడిమల అప్పారావ్‌కు చెందిన ఆస్తి, పడమర: ఖమ్మం – సత్తుపల్లి ఆర్ & బి రోడ్డు. **ఆస్తి నం.3:** తెలంగాణ రాష్ట్రం, ఖమ్మం జిల్లా, సత్తుపల్లి మం॥, కాకర్ల పల్లి గ్రా॥ & గ్రా॥ పంచాయితీలోని సర్వే నం.లు. 335 & 339/ఇలో ఎ॥ 1.38 గు॥ల భూమి యావదాస్తి, అన్ని అభివృద్ధులతో మరియు హక్కులతో శ్రీమతి విజయలక్ష్మి గాదెకు చెందియున్నది. **సరిహద్దులు:** ఉత్తరం: చెన్నారావ్ & మనోహర్ యొక్క ఆస్తి, దక్షిణం: కెనాల్ మరియు విజయలక్ష్మి గాదె యొక్క ఆస్తి, తూర్పు: కంచర్ల గణపతిరావ్ యొక్క ఆస్తి, పడమర: రోడ్డు మరియు ఎ.రాధారాణి యొక్క ఆస్తి.

నియమ నిబంధనలు :

1. సదరు వేలము SARFAESI చట్టంలోని సదుపాయములను అనుసరించి అధీకృత అధికారిచే ఇ-వేలము విధానము ద్వారా ఇ-వేలము నిర్వహించబడును. వేలము/బిడ్డింగ్ సర్వీస్ ప్రొవైడర్ M/s C1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారు ఏర్పాటు చేసిన ఇ-వేలము ప్లాట్‌ఫామ్ వెబ్‌సైట్ : https://www.bankeauctions.com ద్వారా ఆన్‌లైన్ ఎలక్ట్రానిక్ పద్ధతి ద్వారా మాత్రమే నిర్వహించబడును.
2. సదరు ఇ-వేలము బిడ్డు పత్రములోని నియమ నిబంధనలు మరియు ప్రొసీజర్ ద్వారా నిర్వహించబడును. కావున బిడ్డర్లు ఫీనిక్స్ వారి వెబ్‌సైట్ అనగా www.phoenixarc.co.in మరియు సర్వీస్ ప్రొవైడర్ వారి వెబ్‌సైట్ : www.bankeauctions.com ద్వారా బిడ్డు పత్రముల కొరకు వేలమునకు పెట్టిన సెక్యూర్డ్ ఆస్తుల వివరములు మొ॥నవి పొందవచ్చును.
3. బిడ్డర్లు వారు నచ్చిన ప్రదేశం / వారి స్వంత కార్యాలయమునుండి బిడ్డింగ్/ కోటింగ్ చేస్తూ ఇ-వేలములో పాల్గొనవచ్చును. ఒక్కొక్క బిడ్డరుకు ఇంటర్‌నెట్ కనెక్టివిటీ ఏర్పాటు చేయబడును. కాని ఇంటర్‌నెట్ కనెక్టివిటీ, నెట్‌వర్క్ సమస్యలు, సిస్టం క్రాష్‌డౌన్, పవర్ ఫెయిల్యూర్ మొదలగు వాటికి అధీకృత అధికారి / ఫోనెక్స్ / సర్వీస్ ప్రొవైడర్ బాధ్యత వహించదు.
4. ఔత్సాహిక బిడ్డర్ల వివరములకొరకు సహాయము, ప్రొసీజర్ మరియు ఇ-వేలము యొక్క ఆన్‌లైన్ శిక్షణ కొరకు M/s C1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, సంప్రదించవల్సిన నం. +91-120-4888888, +91-124-4302000, 09821690968, ఇ-మెయిల్ ఐడి: support @bankeauctions.com కు సంప్రదించవచ్చును.
5. బిడ్డర్లు బిడ్డు ఫారము పొందుటకు/ వేలము కొరకు సిద్ధం చేసిన సెక్యూర్డ్ ఆస్తులను తనిఖీ చేసుకొనుటకు ఫోనెక్స్ వారి వెబ్‌సైట్ www.phoenixarc.co.in ద్వారా పొందవచ్చును.
6. సదరు ఇ-వేలము క్రింద తెలిపిన తేదీ మరియు సమయములో నిర్వహించబడును. పైన తెలిపిన సెక్యూర్డ్ ఆస్తులు ఎక్కడ ఎలా ఉన్నదో మరియు ఏది ఎలా ఉన్నదో నిబంధనపై అమ్మబడును. సదరు సెక్యూర్డ్ ఆస్తి ఆంధ్రాబ్యాంక్ (ప్రస్తుతం పృథ్వీ అస్సెట్ రీకన్‌స్ట్రక్షన్ అండ్ సెక్యూరిటైజేషన్ కంపెనీ లిమిటెడ్ మరియు పిఎన్‌బి హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ పరిపస ఆధారముగా) వారి ఛార్జీలకు లోబడి యుండును.
7. కొనుగోలుదారులు/ బిడ్డర్లు పైన తెలిపిన వెబ్‌సైట్ : https://www.bankeauctions.com. పోర్టల్‌లో వారి పేరు నమోదు చేయించి యూజర్ ఐడి మరియు పాస్ వర్డ్ ను ఉచితంగా పొంది పైన తెలిపిన తేదీ మరియు సమయములో ఇ-వేలమునందు పాల్గొనవచ్చును.
8. ఇ-వేలములో పాల్గొను ఔత్సాహిక బిడ్డర్లు/కొనుగోలుదారులు రిజర్వు ధరలోని 10% తిరిగి పొందు ధరావత్తు సొమ్మును చెల్లించుటకు పూర్తి వివరములతో పాన్ కార్డ్ కాపీ, ఒకవేళ ఉన్నట్లయితే కంపెనీ యొక్క బోర్డు తీర్మానములు మరియు నివాస ధృవీకరణ తేదీ: 08.01.2018లోగా దాఖలు చేయవలెను.
9. విజేత కొనుగోలుదారు/ బిడ్డరు ఫోనెక్స్ ద్వారా ఖరారు అయిన తర్వాత వేలము రోజున అనగా 09.01.2018న బ్యాంకు ముగింపు సమయముకంటే ముందుగా పైన తెలిపిన ఖాతాలకు RTGS ద్వారా 25% (ధరావత్తుతో కలుపుకొని) వెంటనే చెల్లించవలెను. విఫలమైనట్లయితే అమ్మకం రద్దయినట్లుగా పరిగణించి విజేత కొనుగోలుదారు/ బిడ్డరు చెల్లించిన ధరావత్తు సొమ్ము కూడా రద్దగును.
10. వేలములో పాల్గొని, విజయవంతంకాని ఇతర బిడ్డర్లకు వారి ధరావత్తును ఫోనెక్స్‌వారు ఇ-వేలము ముగిసిన 48 గం.లలోగా తిరిగి చెల్లించెదరు. కాని సదరు ఇ-వేలముపై ఎటువంటి వడ్డీ చెల్లించరు.
11. విజేత కొనుగోలుదారు/ బిడ్డరు కొనుగోలుపై బ్యాలెన్స్ మొత్తమును సెక్యూర్డ్ ఆస్తులు అమ్మకం ఖరారు తేదీ నుండి పదిహేను (15) రోజులలోగా చెల్లించవలెను. లేదా వ్రాతపూర్వకముగా ఒప్పందం చేసి సమయం పొడిగించుకొనవచ్చును. ఒకవేళ విఫలమైనట్లయితే అంతకుముందు చెల్లించిన మొత్తాలన్నియూ రద్దగును.
12. ఆస్తి యొక్క తనిఖీ కొరకు మరియు ఇతర సమాచారము కొరకు ఔత్సాహిక బిడ్డర్లు మిస్ గుర్లీన్ ఛాబ్రా/ శ్రీ అజిత్ కెవిన్ వారిని పైన తెలిపిన చిరునామాలో లేదా gurleen.chhabra@phoenixarc.co.in/ ajit.kewin@phoenixarc.co.in (ఇమెయిల్) లేదా 09167930326/ 09619866780కు సంప్రదించవచ్చును.
13. సెక్యూర్డ్ ఆస్తులపై రుణములు, వేలము ఆస్తి యొక్క టైటిల్, ఫిర్యాదులు / హక్కులు/ బకాయిలు అనగా చట్టబద్ధ బకాయిలు మరియు ప్రత్యేక బకాయిలతో కలుపుకొని బిడ్డు దాఖలుకు పూర్వమే ఔత్సాహిక బిడ్డర్లు వారంతట వారే తనిఖీ చేసుకొని తృప్తి చెందిన తర్వాత దాఖలు చేయుట వారి బాధ్యత.
14. దిన పత్రికలలో ప్రచురించిన వేలము నోటీసు యొక్క పూర్తి వివరములు ఈక్రింది సంతకందారుకు తెలిసినంతవరకు ప్రచురించడమైనది. అయినప్పటికీ ఏవైనా పొరపాట్లు, తప్పుఒప్పులు లేదా తీసివేతలు ఉన్నట్లయితే ఈ క్రింది సంతకందారు బాధ్యత వహించరు.
15. ఏ పరిస్థితిలోనైనా ముందస్తు కారణము మరియు ఏవైనా ముందస్తు నోటీసు తెలుపకుండా వేలముయొక్క బిడ్డు / ఆఫర్ యొక్క స్వీకరణ/ నిరాకరణ/ సవరణ / రద్దు లేదా వేలము వాయిదా వేయుటకు అధీకృత అధికారికి పూర్తి హక్కు కలదు.
16. విజేత కొనుగోలుదారు / బిడ్డరు చట్టపరంగా వర్తించు అతను/ఆమెకు సంబంధించి చట్టపర బకాయిలు, పన్నులు, ఫీజు, స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు మొ॥నవి వారే భరించవలెను.
17. బకాయి మొత్తము చెల్లించవలసిన సదరు రుణగ్రహీత/ హామీదారులు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, రూల్ 8 క్లాజ్(6)లోని సదుపాయముల క్రింద అమ్మకము నోటీసును పైన తెలిపిన వేలం నోటీసుగా పరిగణించవలెను.
18. ఒకవేళ ఏదైనా కారణములతో పైన తెలిపిన షెడ్యూల్ వేలము నిర్వహించుటలో విఫలమైనట్లయితే ఫోనెక్స్ వారికి సదరు సెక్యూర్డ్ ఆస్తిని ఇదే నోటీసు ద్వారా ప్రైవేట్ ఒప్పందంపై SARFAESI యాక్ట్, 2002లోని సదుపాయముల క్రింద వేలము వేయబడును.

ప్రదేశం: సత్తుపల్లి
తేది: 29.11.2017

సం/- అధీకృత అధికారి, ఫోనెక్స్ ఎఆర్‌సి ప్రైవేట్ లిమిటెడ్,
ఫోనెక్స్ ట్రస్ట్ ఎఫ్‌వై 17-8

ప్రయాస పరీక్షలు

- **ఇంజనీరింగ్‌లో ప్రవేశాలకు**
- **ఐదారు పరీక్షలు రాస్తున్న విద్యార్థులు**
- **దరఖాస్తులకే రూ. 10-15 వేల వ్యయం**
- **జాతీయ పరీక్షపై నీలినీడలు**

మన తెలంగాణ/ హైదరాబాద్ : ఇంజనీరింగ్ చదవాలనుకునే విద్యార్థులకు ఇంటర్ రెండవ సంవత్సరం నుంచే ప్రవేశ పరీక్షల టెన్షన్ మొదలవుతోంది. ఒక్కో విద్యార్థి కనీసం ఐదు పరీక్షలు రాయాల్సి వస్తోంది. ఒక్కో పరీక్షకు ఒక్కో రకమైన సిలబస్ ఉంటుండంతో ఏ పరీక్షపైన పూర్తి స్థాయిలో దృష్టి సారించాలో అర్థం కాక అయోమయానికి గురవుతున్నారు. ఇప్పటికే దేశంలోని కొన్ని ప్రముఖ డీమ్డ్ యూనివర్సిటీలు ప్రవేశాల కోసం ప్రకటనలు ఇచ్చేయగా, మరికొన్ని వర్సిటీలు మరో నెల రోజుల్లో షెడ్యూల్ విడుదల చేయనున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని ఇంజనీరింగ్ కళాశాలలు సరైన ప్రమాణాలు పాటించడం లేదన్న భావనతో వేలాదిమంది విద్యార్థులు కనీసం 3–4 డీమ్డ్ వర్సిటీల ప్రవేశ పరీక్షలు రాస్తున్నారు. అలాగే ఎన్‌ఐటి, ఐఐటిలలో ప్రవేశాలకు నిర్వహించే జెఇఇ మెయిన్స్, అడ్వాన్స్‌డ్‌తో పాటు తెలంగాణ, ఎపి ఎంసెట్ పరీక్షలకూ హాజరవుతున్నారు. ఇంజనీరింగ్ సీట్ల భర్తీకి నీట్ తరహాలో జాతీయ స్థాయిలో ప్రవేశ పరీక్ష నిర్వహించాలన్న కేంద్ర ప్రతిపాదన కార్యరూపం దాల్చకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రవేశ పరీక్షలకే రూ. వేలల్లో ఫీజులు

ఇంజనీరింగ్ ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో, రాష్ట్రాల స్థాయిలో ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తుండగా, ఈ ప్రవేశ పరీక్షలకు ఫీజులు చెల్లించేందుకే కనీసం రూ.10 వేల నుంచి రూ. 15 వేల వరకు వెచ్చించాల్సి వస్తోంది. కొన్ని డీమ్డ్ వర్సిటీలు మినహా అన్ని ఎంట్రన్స్ టెస్టులు ఆన్‌లైన్‌లో కంప్యూటర్ ఆధారిత పరీక్షలే జరుగుతున్నాయి. దీనికి ప్రశ్నపత్రాలు ముద్రించాల్సిన అవసరం ఉండదు. వర్సిటీలు రూ.1000 నుంచి రూ.2,000 వరకు ఫీజులు వసూలు చేస్తున్నాయి. కొన్ని ప్రముఖ డీమ్డ్ వర్సిటీలు కేవలం దరఖాస్తుల ఫీజుల ద్వారానే రూ.లక్షలు వెనుకేసుకుంటున్నాయి. వీటితో పాటు జెఇఇ మెయిన్స్ అయితే ఆన్‌లైన్‌కు బాలురకు రూ. 1,000, బాలికలకు రూ.500 ఉండగా, ఆన్‌లైన్ పరీక్షలకు రూ.600 నుంచి రూ.300 ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. అలాగే రాష్ట్ర ఎంసెట్‌కు రూ.500 ఫీజు ఉండగా, ఎపి ఎంసెట్‌కు రూ.450 ఫీజు చెల్లించాలి.

జాతీయ పరీక్షపై నీలినీడలు

ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నీట్ తరహాలో ఒకే పరీక్ష నిర్వహించాలని కేంద్రం నిర్ణయించిన నేపథ్యంలో వచ్చే ఏడాది ఎంసెట్ ఉంటుందా..?లేదా..? అనే సందేహాలు వెలువడ్డాయి. అయితే ఇప్పటివరకు కేంద్రం నుంచి రాష్ట్రాలకు ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో వచ్చే ఏడాది కూడా ఎంసెట్ నిర్వహించేందుకు రెండు తెలుగు రాష్ట్రాలు సమాయత్తమవుతున్నాయి. అయితే భవిష్యత్తులో కూడా ఇంజనీరింగ్ ప్రవేశాలకు దేశవ్యాప్తంగా ఒకే పరీక్ష జరుగకపోవచ్చనే అభిప్రాయాలు వెలువడుతున్నాయి. దేశవ్యాప్తంగా ఐఐటి, ఎన్‌ఐటిలతోపాటు రాష్ట్రాల వర్సిటీల పరిధిలోని ఇంజనీరింగ్ సీట్లు ఉన్నాయి. వివిధ రకాల ఇంజనీరింగ్ సీట్ల భర్తీకి ఒకే పరీక్ష నిర్వహించడం సాధ్యం కాదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇంజనీరింగ్‌కు ఒకే పరీక్ష నిర్వహిస్తే ఐఐటి, ట్రిపుల్ ఐటి, ఎన్‌ఐటి ప్రవేశాలకు నిర్వహించే జెఇఇని కూడా రద్దు చేయాల్సి ఉంటుంది. జాతీయ స్థాయిలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తే సిబిఎస్ఇ సిలబస్‌కు అనుగుణంగా ప్రశ్నలు ఉండాలి. ఈ ప్రశ్నలు కఠినంగా ఉండే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇంటర్ వరకు రాష్ట్రాల సిలబస్‌లో చదువుకుని రాష్ట్ర స్థాయి ఇంజనీరింగ్ సీటు కోసం ప్రయత్నించే విద్యార్థులు జాతీయ స్థాయి పరీక్షను ఏ విధంగా ఎదుర్కొంటారని నిపుణులు ప్రశ్నిస్తున్నారు. దాంతోపాటు జాతీయస్థాయి ఉమ్మడి ప్రవేశ పరీక్షను కొన్ని రాష్ట్రాలు తీవ్రంగా వ్యతిరేస్తున్నాయి. సుమారు గత పదేళ్లుగా కొన్ని రాష్ట్రాల్లో పదవ తరగతి, ఇంటర్ సిలబస్‌లో ఎలాంటి మార్పులు జరగలేదు. ఈ నేపథ్యంలో ఒకే పరీక్ష పెడితే ఆయా రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు ఇబ్బంది పడతారని, ఇతర రాష్ట్రాలతో పోటీపడే పరిస్థితి ఉండదని కొన్ని రాష్ట్రాలు పేర్కొంటున్నాయి.

ప్రోటోకాల్ పాటించకపోవడం నియంత పాలనకు నిదర్శనం

- **పాలన అంటే ఆ ఇద్దరేనా : గూడూరు నారాయణరెడ్డి**

మన తెలంగాణ / హైదరాబాద్ : మెట్రో రైల్ ప్రారంభ కార్యక్రమంలో నగర ప్రథమ పౌరుడు, మేయర్ బొంతు రామ్మోహన్ పేరు ప్రకటనలో కానీ, శిలా ఫలకంపైన కానీ లేదని, ఇది సిఎం కెసిఆర్, మంత్రి కెటిఆర్ నియంత పోకడలకు నిదర్శనమని టిపిసిసి కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి అన్నారు. ప్రజాప్రతినిధులను గౌరవించకపోవడం అంటే ప్రజలను అవమానపరిచినట్లేనని, వెంటనే ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. మీడియాతో మంగళవారం ఆయన మాటాట్లాడుతూ నగర ప్రజాప్రతినిధులకు కనీస గౌరవం ఇవ్వకుండా ప్రారంభోత్సవం చేయడం తెలంగాణ ఆత్మ గౌరవాన్ని దెబ్బతీయడమేనన్నారు. మంత్రులు, టిఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధులు బానిసలుగా మరిపోయారని, పాలకులు నియంతలుగా మారారని ఆయన అన్నారు. నగరానికి చెందిన మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కెసిఆర్ కుటుంబాన్ని ప్రశ్నించే పరిస్థితిలో లేరని, శిలాఫలకంపై తన పేరు లేకున్నా తలసాని అడగలేక పోతున్నారని, టిఆర్‌ఎస్ నాయకులు చీము, నెత్తురు లేకుండా మరిపోయారని విమర్శించారు.

మెట్రో రైల్ ఛార్జీలను తగ్గించాలి

మన తెలంగాణ / హైదరాబాద్ : మెట్రో రైలు ఛార్జీలు తగ్గించి సామాన్య, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా నిర్ణయించాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. నగరంలో కాలుష్యం, ట్రాఫిక్ ఇబ్బందులు నిత్యం పెరుగుతున్న దృష్ట్యా మెట్రో రైలు వస్తే కొంత ఉపశమనాన్ని కలుగుతుందని, తక్కువ ఛార్జీలతో ప్రయాణించవచ్చని సామాన్య ప్రజలు ఆశపడ్డారని, అందుకు భిన్నంగా దేశంలో ఎక్కడా లేని విధంగా టికెట్ ధరలు ఎక్కువగా నిర్ణయించి వారి ఆశలపై ప్రభుత్వం నీళ్ళు చల్లిందని ఆయన విమర్శించారు.

విక్టోరియా హోమ్ భూములపై హైకోర్టు తీర్పు హర్షణీయం

అనాథ విద్యార్థుల కోసం కేటాయించిన విక్టోరియా మెమోరియల్ హోమ్ భూములపై మంగళవారం హైకోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయమని తమ్మినేని మరొక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ తీర్పుతో రాష్ట్ర ప్రభుత్వానికి కనువిప్పు కలగాలని, పట్టుదలకు పోకుండా భూములను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు.

డిఇఒలతో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి.కిషన్ సమావేశం

మనతెలంగాణ/ హైదరాబాద్ : ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న సివిల్ వర్క్స్ త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి.కిషన్ జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన డిఇఒలతో సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో సివిల్ వర్క్స్, వివిధ కోర్టులలో విద్యాశాఖ ఎదుర్కొంటున్న కేసులపై సమీక్షించారు. అలాగే జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు, ఇతర సమస్యలపై డిఇఒలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 3 వేల కేసులుండగా, 1,700 కేసుల వరకు ఉద్యోగుల సర్వీసుకు సంబంధించిన కేసులు ఉన్నట్లు తెలిసింది.

క్యాబినెట్‌లో స్థానం కల్పించరు కానీ ఢిల్లీలో ధర్నా చేస్తారు

రిజర్వేషన్లపై సిఎం కెసిఆర్ విచిత్ర వైఖరి : ఎల్. రమణ

మన తెలంగాణ/ హైదరాబాద్ : వంద ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రలకు వెళ్లినట్లుగా ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు వ్యవహారశైలి ఉందని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు ఎల్.రమణ అన్నారు. రిజర్వేషన్లు కల్పించే అంశాన్ని రాష్ట్రానికే వదిలేయాలనే డిమాండ్‌తో కెసిఆర్ ఢిల్లీలో ధర్నా చేస్తానంటున్నారని, ఇక్కడ రాష్ట్ర క్యాబినెట్‌లో మాత్రం బడుగు, బలహీన వర్గాల మహిళలకు ఎందుకు స్థానం కల్పించడం లేదని ప్రశ్నించారు. ఎన్‌టిఆర్ భవన్‌లో మంగళవారం టిడిపి రాష్ట్ర బిసి సెల్ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే 127 వర్ధంతి వేడుకలను నిర్వహించారు. పూలే చిత్రపటానికి నివాళులర్పించి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ కుల వ్యవస్థ నిర్మూలనకు పూలే కంకణం కట్టుకుని పనిచేశారన్నారు. అసమానతల తొలగింపునకు విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్లు అవసరమని జ్యోతిరావు అనాడే గ్రహించారన్నారు. సామాజిక న్యాయమే లక్ష్యంగా టిడిపి ఆవిర్భావించిందని, అదే లక్ష్యంతో ముందుకు సాగుతుందన్నారు. వచ్చే సాధారణ ఎన్నికల్లో అధికారంలోకి వస్తే కేబినేట్‌లో 9 మంత్రి పదవులను బిసిలకు కేటాయిస్తామన్నారు.

దివ్యాంగుల హక్కుల పరిరక్షణలో టిఆర్‌ఎస్ విఫలం

దివ్యాంగుల హక్కులను పరిరక్షించడంలో టిఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని టిడిపి సాంస్కృతిక విభాగం అధ్యక్షులు పి.సాయిబాబా విమర్శించారు. ఎన్‌టిఆర్ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతి ఏటా డిసెంబర్ 3వ తేదీన ప్రపంచవ్యాప్తంగా నిర్వహించే అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని టిఆర్‌ఎస్ అధికారికంగా నిర్వహించిన పాపన పోలేదన్నారు. ఈ మూడేళ్లలో మంత్రులు ఒక్కసారి కూడా దివ్యాంగుల దినోత్సవంలో పాల్గొనలేదన్నారు.

బ్రహ్మణులకు ప్రభుత్వం పెద్ద పీట

మన తెలంగాణ/ హైదరాబాద్ : గత ప్రభుత్వాలు బ్రహ్మణుల సంక్షేమాన్ని పట్టించుకోలేదని బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఛైర్మన్, ప్రభుత్వ సలహాదారు డాక్టర్.కె.వి రమణాచారి అన్నారు. నిరుపేద బ్రాహ్మణుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ అధిక ప్రాధాన్యతను ఇస్తున్నారన్నారు. దేవాదాయ శాఖ అబిడ్స్ బొగ్గుల కుంట కమిషనర్ కార్యాలయంలో తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో బెస్ట్ స్కీం (బ్రహ్మణ పారిశ్రామికవేత్తల అభివృద్ధి పథకం) రెండో విడితలో భాగంగా రెండు రోజుల పాటు ఇంటర్వ్యూలు నిర్వహించి 99 మంది అర్హులైన బ్రాహ్మణ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అనుమతులు మంజూరు చేశారు. ఈ సందర్భంగా రమణాచారి మాట్లాడుతూ బ్రహ్మణుల సంక్షేమానికి రూ. 100 కోట్ల నిధులను సిఎం కెసిఆర్ మంజూరు చేశారన్నారు. బ్రహ్మణ పారిశ్రామికవేత్తలకు మొదటి విడితలో 56 మందికి రూ. 3.28 కోట్లు, రెండో విడతలో 99 మందికి రూ. 4.42 కోట్లను మంజూరు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపి కెప్టెన్ లక్ష్మీకాంత రావు,ప్రభుత్వ సలహాదారు వేణుగోపాలచారి, బ్రహ్మణ సంక్షేమ పరిషత్ సీఈఓ చంద్రమోహన్, సభ్యులు తదితరులు ఉన్నారు.

2021 నాటికి మెట్రో రైలు పొడిగింపు

- **74.7 కి.మీ.లుగా ప్రతిపాదిస్తున్న హెచ్‌ఎండిఎ**
- **సాంకేతిక సలహామండలి సమావేశం సానుకూలం**
- **కోకాపేట్, బిహెచ్‌ఇఎల్, ఎల్‌బినగర్, ఎయిర్‌పోర్టు**

మన తెలంగాణ/ సిటీబ్యూరో : నగరంలో ప్రజా రవాణా వ్యవస్థను మరింత మెరుగుపరిచేందుకు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్‌ఎండిఎ) ప్రణాళికలను రూపొందించింది. 2021 నాటికి నగరంలో వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని తగ్గించడంలో భాగంగా ప్రధానంగా మెట్రోరైలు మార్గాలను పొడిగించడంతో పాటు బస్ ర్యాపిడ్ ట్రాన్స్‌పోర్టు సిస్టం(బిఆర్‌టిఎస్)ను ప్రవేశపెట్టాలనే ప్రతిపాదనలు చేస్తున్నది. ఇదివరకే హెచ్‌ఎండిఎ పలు మార్గాల్లో బిఆర్‌టిఎస్‌ను అమలులోకి తీసుకురావాలని అథారిటీ భావించింది. అయితే, ప్రభుత్వం బిఆర్‌టిఎస్ బాధ్యతలను జిహెచ్‌ఎంసికి అప్పగించడంతో హెచ్‌ఎండిఎ ఆ దిశగా ప్రయత్నాలు నిలిపివేసింది. విశ్వనగరంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ మహానగరంలో ప్రపంచస్థాయిలో రవాణా వ్యవస్థను నెలకొల్పేందుకు అథారిటీ ప్రత్యేక చొరవ చూపుతున్నది. అందులో భాగంగానే అథారిటీ విస్తరిత ప్రాంతంలో సమగ్ర రవాణా అధ్యయనం(కాంప్రహెన్సివ్ ట్రాన్స్‌పోర్టు స్టడీ–సిటిఎస్)ను చేపట్టింది. ఈ అధ్యయనం 2011–14 మధ్యకాలంలో జరిగింది. నగరం, శివారు ప్రాంతాల్లో పెరుగుతోన్న జనాభ, వాహనాల వినియోగంను పరిగణలోకి తీసుకుని భవిష్యత్‌లో ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయాలను కల్పించాలని, అందుకు ప్రత్యేకంగా పథకాలను అథారిటీ రూపొందించింది.

74.7 కి.మీ.లు మెట్రో విస్తరణ...

నగర ప్రయాణికుల రద్దీని దృష్టిలోపెట్టుకుని 2021 నాటికి మెట్రో రైలు మార్గాలను 74.7 కి.మీ.లుగా విస్తరించాలని హెచ్‌ఎండిఎ ప్రతిపాదించింది. ముఖ్యంగా ఉద్యోగులు, విమాన, రైల్వే ప్రయాణికులను పరిగణలోకి తీసుకుని మెట్రోరైలును మరో ఆరు మార్గాలకు పొడిగించాలని అథారిటీ సూచించింది. ప్రధానంగా

సైబర్ టవర్స్– కోకాపేట్ –10.5 కి.మీ.లు, నాగోల్– ఎల్‌బినగర్ – 5.1 కి.మీ.లు, మియాపూర్– బిహెచ్‌ఇఎల్ – 5.8 కి.మీ.లు, జెఎన్‌టియు – ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ – 15.7 కి.మీ.లు, ఫలక్‌నూమా– ఏయిర్‌పోర్టు – 14.1 కి.మీ.లు, లకిడీకాపూల్ – బిహెచ్‌ఇఎల్ – 23.4 కి.మీ.లును 2021 నాటికి తక్షణ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా అందుబాటులోకి తీసుకురావాలని హెచ్‌ఎండిఎ సూచించింది. 2041 నాటికి మొత్తం 321 కి.మీ.లుగా విస్తరించాలని అథారిటీ సిటిఎస్‌లో ప్రతిపాదించడం జరిగింది.

73.5 కి.మీ.లు బిఆర్‌టిఎస్...

నగర ప్రయాణికులు సౌలభ్యమైన ప్రయాణం సాగించేందుకు ప్రత్యేకంగా బస్ ర్యాపిడ్ ట్రాన్స్‌పోర్టు సిస్టం(బిఆర్‌టిఎస్)ను అమలుచేయాలని అథారిటీ సూచిస్తున్నది. నగరంలోని ప్రధాన 7 కారిడార్లలో సుమారు 73.5 కి.మీ.లు బిఆర్‌టిఎస్‌ను వినియోగంలోకి తీసుకురావాలని గతంలోనే ప్రతిపాదించింది. ఇన్నర్ రింగ్ రోడ్, ఔటర్ రింగ్ రోడ్‌కు అనుసంధానంగా ఉన్న రేడియల్ రోడ్లలో బిఆర్‌టిఎస్ నడిపేందుకు అనువుగా ఉన్న మార్గాలను, ప్రాంతాలను పరిశీలించి సమగ్రంగా అధ్యయనం చేసి నివేదికను ఇవ్వాలని గత యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్టు అథారిటీ(ఉమ్టా) సమావేశంలో చర్చించడం జరిగింది. ఆ బాధ్యతలను ఆర్టీసికి కేటాయించినప్పటికీ ఇప్పటి వరకు అధ్యయనం తాలూకు సంబంధించిన ప్రకటన వెలువడలేదు. అయితే, ప్రస్తుత నగర ట్రాఫిక్, రవాణా పరిస్థితుల నేపథ్యంలో మెట్రోరైలు పొడిగింపు, బిఆర్‌టిఎస్ అమలుకు అథారిటీ ప్రాధాన్యతనిస్తుంది. వీటి ద్వారా నగరంలో వ్యక్తిగత వాహనాల వినియోగం తగ్గడంతో కాలుష్యం పెరగకుండా ఉంటుందనేది హెచ్‌ఎండిఎ అభిప్రాయం. ప్రజా రవాణా వ్యవస్థను మరింత అందుబాటులోకి తీసుకురావడం వల్ల ట్రాఫిక్ సమస్యలు లేకుండా నగర రోడ్లపై సాఫీగా ప్రయాణించే సౌకర్యం ఏర్పడుతుందని అథారిటీ మెరుగైన రవాణా వ్యవస్థను ప్రతిపాదిస్తున్నది.